కార్మికుల కన్నీటి కష్టాలు తీరేనా..?

- మే 1న ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవం
- చట్టాలకే పరిమితం.. ఆచరణలో శూన్యం



జవహర్‌నగర్‌లో గడ్డపారకు పదను పెడుతున్న మహిళ



జవహర్‌నగర్: ప్రపంచవ్యాప్తంగా సోమవారం మేడేను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా సభలు సమావేశాలు, జైకొట్టడాలు మామూలే. ప్రతి సంవత్సరం ఇలా జరుపుకుంటున్నా నగర శివారు ప్రాంతాల్లో నివసించే కార్మికుల కష్టాలు మాత్రం ఏమాత్రం తీరడంలేదు. గతంలో మేడేను కేవలం పారిశ్రామిక వాడల్లో మాత్రమే నిర్వహించే వారు. మారిన ప్రపంచంతో పాటు నగరీకరణలో భాగంగా పనిపద్ధతుల తీరుమారాయి. దీంతో రకరకాల కార్మికులు పుట్టుకొచ్చారు. నగర శివారుల్లో చూస్తే భవన నిర్మాణ కార్మికరంగం బాగా విస్తరించింది. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నప్పటికీ వారి జీవితాల్లో మాత్రం పురోగతి కనిపించడంలేదు. వారి చేతిలో పనిముట్లు చంకల్లో సద్దిమూట వేసుకుని అడ్డా కాడికి వెళ్తున్న వారికి పని దొరుకుతుందో లేదో వారికే తెలియదు. ఆ రోజు పనిదొరికితే వారికి పండగే.. గ్రామాల్లో వ్యవసాయం సరిగా లేకపోవడం, కాలం కనికరించకపోవడంతో నగరానికి వలస వచ్చిన అనేక మంది కష్టజీవులు నగరంలో రకరకాల పనులు చేస్తూ స్థిరపడుతున్నారు.

1న ప్రపంచ కార్మికుల పోరాట దినోత్సవంగా..

1886 సంవత్సరం మే 1న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, పనిగంటల తగ్గింపు కోసం అమెరికాలోని చికాగో నగరంలో ఎందరో కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి రక్తాన్ని చిందించిన రోజు. ఇప్పటికి 130 సంవత్సరాలు గడిచాయి. కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రజెండా రెపరెపలాడింది. అందుకే రెండవ కమ్యూనిష్టు ఇంటర్నేషనల్ కార్మికుల పోరాట సంకేతంగా మే 1న ప్రపంచ కార్మికుల పోరాట దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చారు. ఆనాటి నుంచి మేడే పోరాట వారసత్వం శ్రమదోపిడీ నుంచి శ్రామిక విముక్తి పోరాటంగా ప్రపంచ విప్లవాలకు దారితీసింది.

వెలుగులు నిండితేనే మేడే..

నగరంలోని వివిధ ప్రాంతాలతో పోలిస్తే అత్యధికంగా కార్మికులు నివాసం ఉండే ప్రాంతం జవహర్‌నగర్. భవన నిర్మాణాలు, నగరంలోని వివిధ షాపులు, షాపింగ్ మాల్స్ దగ్గర్నుంచి చిన్న చిన్న షాపుల్లో పనిచేసే వారిలో అధిక శాతం ఇక్కడి వారే.. నిత్యం ఉదయం వెళ్లి రాత్రి వరకు ఇళ్లకు చేరుకుంటారు. ఎక్కడ ఏ పని అయినా ఈ ప్రాంతంలోని పేదలు ఎక్కువగా పనిచేసేందుకు వెళ్తుంటారు. అత్యధిక పేదలు నివాసముండే ప్రాంతంలో కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. పనికితగ్గ వేతనాలు దొరకడం, వారి జీవితాలకు భద్రత కల్పించడం, కూడూ గూడు వంటి వస్తువులు అందించడం, చట్టాలను సక్రమంగా అమలు చేసిన రోజే నిజమైన మేడే..



జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్‌నగర్‌లో కార్మికుల జెండా

వలస కూలీలకు భరోసా కల్పించాలి



ఉపాధి కోసం ఇతర జిల్లాల నుంచి వలస వస్తున్న వలస కూలీలకు ప్రభుత్వం భరోసా కల్పించడం లేదు. నగర శివారు ప్రాంతాలకు ప్రతిరోజూ వందల సంఖ్యలో వలస వస్తున్నారు. కనీసం వారికి గుర్తింపు కార్డులు కూడా ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదు. వలస కూలీల కష్టాల కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

– జి.అనురాధ, ఐఎఫ్‌టీయూ (భారత కార్మిక సంఘాల సమాఖ్య) సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి

ప్రైవేటీకరణే ప్రధాన సమస్య..



ప్రైవేటీకరణతో కార్మికులు హక్కులకు దూరం అవుతున్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోగా ఉన్న ఉద్యోగాలను ప్రైవేటీకరణ చేయడంతో కార్మికులు చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ప్రభుత్వాలు కార్మికులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు కృషి చేయాలి.

– షేక్‌షావలి, ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్ ప్రతిఘటన జాతీయ కార్యదర్శి

శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ వారి శ్రమను దోచుకుంటున్నాయి. కార్మికులకు సమగ్ర చట్టం తీసుకువచ్చే వరకు రాజీలేని పోరాటాలు చేస్తాం. సమాజంలో శ్రమ దోపిడీకి గురవుతున్న కష్టజీవుల్ని ఐక్యం చేసి వర్గ చైతన్యం తీసుకువద్దాం.

– ఎన్.బాలమల్లేష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

క్లుప్తంగా...

కన్నీటి నివాళి



జవహర్‌నగర్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వారెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన తాడిపర్తి ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాలాజీనగర్‌లో నివాసముంటున్న ప్రభాకర్ మృతి సమాచారాన్ని అందుకున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు అంత్యక్రియల్లో పాల్గొని గౌరవ వందనం సమర్పించి నివాళులర్పించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో వారెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి 1983లో రిటైర్డ్ అయిన ప్రభాకర్ బాలాజీనగర్‌లో హోలీజైన్ హైస్కూల్ స్థాపించాడు. ఆయనకు భార్య రబిక, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం బొల్లారంలోని హోలీట్రినిటీ చర్చి గ్రేవ్‌యార్డ్‌లో సమాధి చేశారు.

ముగిసిన భక్తి యోగా సమ్మర్ క్యాంపు



క్యాంపులో భోజనం చేస్తున్న చిన్నారులు

మేడ్చల్: హరేకృష్ణ సత్సంగ్ సమతి మేడ్చల్‌లో నిర్వహించిన వేసవి శిబిరం శనివారం ముగిసింది. ఈ నెల 23 నుంచి క్యాంపు నిర్వహించి శనివారం ముగించారు. పిల్లలకు భగవద్గీత పారాయణం అలవాటు చేశారు. ఆటలు, పాటలు, సంస్కృతిపై అవగాహన కలిపించారు. క్యాంపు సాగిన రోజుల్లో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు.

సివిల్ రైట్స్ డే అవగాహన

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని గుంటిగూడలో శనివారం సివిల్ రైట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ హాజరై రాజ్యాంగం ప్రసాదించిన చట్టాలు, పౌర హక్కులపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజిరెడ్డి, నాయకులు నర్సింగ్‌రావు, రాములు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నాం

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్



ఘట్‌కేసర్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: ప్రజలకు పారదర్శక, మెరుగైన పాలన అందిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చించి పలు పనులకు ఆమోదం తెలిపారు. వారు మాట్లాడుతూ తాగునీటి సరఫరా, నాలా సంరక్షణ, హరితహారం, డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్లు, వాహనాల మరమ్మతులు, శ్మశానవాటిక, మూత్రశాలలు, ఫాగింగ్ నిర్వాహణ కోసం కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో మొత్తం రూ.1.4 కోట్లతో పనులు చేపడతామన్నారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధా, నస్రీన్‌సుల్తానా, శశికళ, మల్లేశ్, పద్మారావు, జహంగీర్, వసంత, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, కో ఆప్షన్ సభ్యులు అరుణ, షౌకత్, మేనేజర్ అంజిరెడ్డి, ఏఈ నరేశ్ పాల్గొన్నారు.

పథకం ప్రకారమే చోరీ

జవహర్‌నగర్: వంట చేయాలని మహిళలను పిలిపించి పథకం ప్రకారమే మార్గమధ్యలో మహిళ వద్ద ఉన్న బంగారు ఆభరణాలను, నగదును దొంగిలించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాచకొండ సీపీ చౌహాన్ వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ గ్రామంలో నివసించే అలకుంట్ల కవిత వంట పనిచేసుకుని జీవనం కొనసాగిస్తుంది. ఈ నెల 26న హకీంపేటలో నివసించే అనూప్ సింగ్ అలియాస్ బాబు(32), ప్రకాశ్ చంద్ మీనా(31)లు కలిసి అదేరోజు రాత్రి 8గంటల సమయంలో ఫోన్ చేసి వంట పని ఉందని నమ్మించి హకీంపేటకు రప్పించారు. బైక్‌పై బిట్స్ కళాశాల వైపు తీసుకెళ్లి బాధితురాలిని బెదిరించి ఆమె మెడలోని బంగారు ఆభణాలు, రూ.3 వేల నగదు, సెల్‌ఫోన్ బ్యాగ్‌ను అపహరించుకుని పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. 24 గంటల్లోపే నిందితులను పట్టుకున్న సీఐ సీతారాం, ఎస్‌ఐలు మోహన్, రాంబాబు, హెచ్‌సీ శేఖర్, పీసీ ప్రశాంత్‌ను రాచకొండ సీపీ చౌహాన్, మల్కాజిగిరి డీసీపీ జానకీ అభినందించారు.

ప్రజల వద్దకే ఆస్పత్రులు, వైద్యం

కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



దమ్మాయిగూడ మున్సిపాలిటీ 18వ వార్డులో బస్తీదవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: రాష్ట్రంలో పేదల ఆరోగ్య సంరక్షణకు మంచి వైద్యం అందించేందుకు బడ్జెట్‌లో 10 వేల కోట్లను సీఎం కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు కేటాయించారని కార్మిక శాఖా మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీదవాఖానాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో బస్తీల్లో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యంతో పాటు మందులను అందజేస్తోందన్నారు. దీనికితోడు పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు నగరానికి నలువైపులా నాలుగు పెద్ద ఆస్పత్రులను నిర్మించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది లేక, సౌకర్యాలు లేక ఆసుపత్రి వచ్చే రోగులు, ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడు ప్రజల వద్దకే ఆసుపత్రులు, వైద్యసిబ్బందిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇటీవలే కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల కళ్ల సమస్యలను గుర్తించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయడం, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా జరిపిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఇన్ని సంక్షేమ పథకాలు అమలవుతున్న రాష్ట్రం దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రమే అన్నారు. మున్ముందు కూడా మరిన్ని పథకాలను పేదల కోసం అమలు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్, వైస్‌చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, కమిషనర్‌స్వామి, మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, కౌన్సిలర్లు శ్రీహరిగౌడ్, స్వప్నహరిగౌడ్ పావని, మౌనిక, అనురాధ, కొత్త సురేఖ, వెంకటేష్, నర్సింహారెడ్డి, వెంకటరమణ, సుజాత, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో సమాజానికి మేలు



హ్యాకథాన్‌ను పర్యవేక్షిస్తున్న జగదాంబ, ధీరజ్‌రెడ్డి

ఘట్‌కేసర్: సాంకేతికతను సమాజానికి మేలు చేసే విధంగా వినియోగించాలని ఇన్ఫోసిస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జగదాంబ, గౌరవ అతిథి ఆర్ఎస్ఎస్ సొల్యూషన్స్ మేనేజర్ ధీరజ్‌రెడ్డి అన్నారు. చౌదరిగూడ నల్లా నరసింహారెడ్డి అటానమస్ కళాశాలలో ఐఐఐసీ, ఐఐసీ సౌజన్యంతో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వారు దేశంలో పాటు ప్రపంచంలోని ఉపాధి అవకాశాలు, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. 'రిచ్ వెబ్ డెవలప్‌మెంట్'పై నిర్వహించిన హ్యాకథాన్‌లో 150 మంది విద్యార్థులు పోటీపడ్డారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సీవీ కష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నల్లా ప్రశాంత్‌రెడ్డి, హ్యాకథాన్ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, కో కన్వీనర్ రామేశ్వరయ్య, రవిచంద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గూడూరు శుక్లమ్మ వర్ధంతి



కీసర: గూడూరు శుక్లమ్మ సేవాసంస్థ ఆధ్వర్యంలో పేదల సంక్షేమానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నాగారం మాజీసర్పంచ్ గూడూరు అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం గూడూరు శుక్లమ్మ 9వ వర్ధంతిని పురస్కరించుకొని సాధన మానసిక వికలాంగుల సేవాసంస్థలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్నదానం నిర్వహించారు. నాగారం మున్సిపల్ కౌన్సిలర్ గూడూరు సబితాఆంజనేయులుగౌడ్, గూడూరు శుక్లమ్మ సేవాసంస్థ ప్రతినిధులు గూడూరు పెంటయ్యగౌడ్, కృష్ణాగౌడ్, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, చక్రపాణిగౌడ్, రమేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.



సొసైటీ సొమ్ము దుర్వినియోగం



మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని ఎప్సిలన్ సొసైటీ సొమ్మును సొసైటీ కార్యవర్గం దుర్వినియోగం చేస్తోందని ఎప్సిలన్‌లో నివాసముంటున్న వారు జిల్లా కో ఆపరేటివ్ అధికారికి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ భవనంలోని డీసీఓ కార్యాలయానికి వెళ్లి ఎప్సిలన్ సొసైటీపై ఫిర్యాదు చేశారు. కో ఆపరేటివ్ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు ఖర్చు చేస్తూ నిబంధనలు పాటించడం లేదన్నారు. సొసైటీ కార్యదర్శి లక్షల రూపాయాలను దుర్వినియోగం చేస్తున్నారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎప్సిలన్‌లో నివాసముంటున్న 15మంది ఉన్నారు.

అకాల వర్షం.. అస్తవ్యస్తం..



రాంపల్లి చౌరస్తాలో వరద నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



జేసీబీతో మరమ్మతుల చేయిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం గంటసేపు కూడిన భారీవర్షం కురిసింది. దీంతో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లోని లోతట్టుకాలనీల్లోకి వరద నీరు వచ్చిచేరింది. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భావానీనగర్ కాలనీలోని నాలా పొంగిపారింది. ఇక నాగారం- కీసర ప్రధాన రహదారిలో రాంపల్లి చౌరస్తా సమీపంలో వరద నీరు ఏకంగా ప్రధాన రహదారిపై నుంచి పారింది. బీఎంఆర్‌కాలనీ, వెంకట్‌రెడ్డినగర్‌కాలనీ, శ్రీజా తదితర కాలనీల్లో వరదనీరు ఇళ్లముందు నిల్వడంతో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి వరద కాలనీల్లో పర్యటించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.

వరద సాఫీగా వెళ్లేలా..

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని టీచర్స్ కాలనీలో రోడ్డుపై వరద నీరు నిలిచాయన్న స్థానికుల ఫిర్యాదు మేరకు చైర్‌పర్సన్ పావనీయాదవ్ శనివారం జేసీబీ సాయంతో శనివారం మరమ్మతులు చేయించారు. కౌన్సిలర్ మల్లేశ్, జంగయ్యయాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

జవహర్‌నగర్: భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ అన్నారు. శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని తహసీల్ మీటింగ్ హాల్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సమాజాన్ని నిర్మించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఆయన తత్వశాస్త్రంలో అరిస్టాటిల్ స్థాయి వారన్నారు. భారతీయులంతా జ్ఞానులుగా రూపొందాలన్నదే అంబేద్కర్ లక్ష్యమన్నారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్



జవహర్‌నగర్‌లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో బాలమల్లేష్

జవహర్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్ అన్నారు. శనివారం జవహర్‌నగర్‌లో ఇంటింటికీ సీపీఐలో పాల్గొని మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం, నిరక్ష్యరాస్యత, ఆకలి, అంటరానితరం పెరిగి ప్రజల జీవన స్థితిగతులు దుర్భరంగా మారాయన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశంలోని ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారన్నారు. సీపీఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి టి.శంకర్, కాప్రా మండల కార్యదర్శి యాదగిరి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణమూర్తి, అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్, గిరిప్రసాద్‌నగర్ కాలనీ కార్యదర్శి రాజేశ్వరీ ఉన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



కొర్రెముల్‌లో బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: ఇటీవల మరణించిన వారి కుటుంబీకులకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. చౌదరిగూడకు చెందిన శోభ, హరీశ్ కుమార్, సుగుణ, లక్ష్మమ్మ, కొర్రెముల్ గ్రామానికి చెందిన లలిత, కలమ్మ, మల్లయ్య, శ్రీనివాస్ కుటుంబీకులను మంత్రి మల్లారెడ్డి ఆదేశానుసారం ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు శనివారం బాధితుల ఇంటికెళ్లి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు అందజేశారు. సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, రమాదేవి, వార్డు సభ్యులు లక్ష్మణ్‌గౌడ్, స్వామి దాస్, ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, బీఆర్ఎస్ చౌదరిగూడ అధ్యక్షుడు లింగంయాదవ్, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, కృష్ణయాదవ్, రవి, సత్యనారాయణ ముదిరాజ్, ట్రస్ట్ సభ్యుడు వేణు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం అధికారులపై ఒత్తిడి తేవాలని బీజేపీ పోచారం పురపాలక సంఘ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్‌ను కాలనీవాసులు కోరుతూ శనివారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సురేష్‌ను కలిసిన వారిలో కాలనీవాసులు తావ్ర్యానాయక్, వసంత, అరుణ, చందర్, నిర్మల, లలిత, హరిసింగ్, రాకేష్, మీన, సంధ్య తదితరులు ఉన్నారు.